ఓం నమో భగవతే శ్రీ రమణయ



# రమణ భాస్కర



సంపుటి : 8 | సంచిక : 18 | పుష్పం : 46-47 | 5-6-2003

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 18

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
**SHRIRAM GRAPHICS**
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-04-03, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పనిచేసి మర్చిపోవటం మంచిది. అది మంచిపని అయినా కూడా చేసి మర్చిపోవాలి. మనం ఎంతతొందరగా మర్చిపోతే ఈశ్వరుడు అంతగా గుర్తుపెట్టుకొని మనం ఏలోకంలోఉన్నా కూడా మనవాటా మనకు పంపిస్తాడు. మనం దేహమేఆత్మ అనుకోవటం వలన అనేకమంది జీవులు ఉన్నారని మనకు అనిపిస్తుంది. దేహముతో తాదాప్యం పొందే నేనును మర్చిపోతే అసలు జీవులేలేరు, ఉన్నది ఒక్కటే సత్‌పదార్థము, అదే ఆత్మ, అదే చైతన్యము. మానవస్వభావంలో కృతజ్ఞత తక్కువుగా ఉంటుంది. మీరు ఎవరికైనా సహాయసహకారములు అందిస్తే, వారు అభివృద్ధిలోనికి రావటానికి చేయూతనిస్తే మీ పట్ల వారు కృతజ్ఞతగా ఉంటారని మీరు అనుకోనక్కరలేదు. మానవస్వభావంలో ఇరుకు ఉంటుంది. వెయ్యిఎకరాలు సంపాదించిఇస్తే తల్లిదండ్రులపట్ల కృతజ్ఞతలేనివారు ఉన్నారు. వారి శవాన్ని తీసుకొనివెళ్ళటానికి కూడా సిఫార్సులు చేయించవలసివస్తుంది. మనం ఎవరితోనైనా మాట్లాడుతున్నాము అనుకోండి, ఆ మాట్లాడేపని అయిపోయినతరువాత అక్కడ మాటలు ముగించేయటం మంచిది, లేకపోతే అనవసరమైన మాటలు వస్తాయి. జీవితంలో క్రమశిక్షణ అవసరం. మనం ఆధ్యాత్మికంగా కాని, భౌతికంగా కాని అభివృద్ధిలోనికి

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగహ్రాభాషణములు**

16-4-03 భీమవరం ........ 1
25-4-03 పోడూరు ........ 10

Visit us @ www.srinannagaru.com



రావాలంటే క్రమశిక్షణ ముఖ్యం. తల్లిని గౌరవించు, తండ్రిని గౌరవించు, ఆచార్యుడిని గౌరవించు, దైవాన్ని గౌరవించు అని చెపుతారు. అంతవరకు వెళ్ళనక్కరలేదు మనం ఇతరులను గౌరవించటం వలన మనకు లాభం కలుగుతుంది కాని నష్టంరాదు. ఇతరులను అగౌరవపరిస్తే ఎప్పటికైనా మనం నష్టపోతాము. అభ్యాస, వైరాగ్యములు విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. మనకు తెలుగు రాకపోతే తెలుగుబాష నేర్చుకొంటాము. లెక్కలు రాకపోతే లెక్కలు నేర్చుకొంటాము అలాగే నీకు అభ్యాస వైరాగ్యములు ఉంటే సరే సరి, లేకపోతే వాటిని నేర్చుకోవాలి. మన ఇల్లును, శరీరాన్ని శుభ్రంచేసుకొంటున్నాము కాని మనస్సును శుభ్రం చేసుకోవటం మర్చిపోతున్నాము. మనస్సును శుభ్రం చేసుకోవటం అనేది అన్నిటికంటే అత్యంత ప్రధానమైనది. మరణానంతరం మన ఇల్లు మనకూడా రాదు, మన శరీరం మనకూడా రాదు, మనస్సు మనకూడా వస్తుంది. మనకూడా రాని ఇల్లుపట్ల, మనకూడారాని శరీరంపట్ల చూపిస్తున్న శ్రద్ధ మనకూడా వచ్చే మనస్సు మీద శ్రద్ధ చూపించటం లేదు. మన మనస్సును కండిషన్‌లో పెట్టుకోవాలి, కంట్రోల్‌లో పెట్టుకోవాలి. మనం ఏ విషయాలనయితే మర్చిపోవాలో, ఈ విషయాలను మర్చిపో అని మనస్సుతో చెపితే అది మర్చిపోవాలి, ఏ విషయాలనయితే మనం జ్ఞాపకం పెట్టుకోవాలో వాటిని జ్ఞాపకం పెట్టుకోమని మనస్సుతో చెపితే అది జ్ఞాపకం పెట్టుకోవాలి, అప్పుడు మనస్సు మన కంట్రోల్‌లో ఉన్నట్లు గుర్తు. మనం జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడటం వలన జాగ్రత్తగా ఆలోచించి పనిచేయటం వలన ప్రమాదంలో పడము. మనం ఏదైనా మాట్లాడేటప్పుడు ఇతరులక్షేమంకోరి మాట్లాడాలి, ఇతరులను ప్రేమించి మాట్లాడాలి. ఇతరుల క్షేమంకోరి మాట్లాడుతూ ఉంటే, ఇతరులను ప్రేమించి మాట్లాడుతూ ఉంటే అది కూడా మన సాధనలో ఒక భాగం అవుతుంది. సాధన అంటే పూజ, జపం, ధ్యానం ఇవే సాధనలు అనుకోవద్దు. ఇతరులను ప్రేమించటం, ఇతరుల క్షేమంకోరి పనిచేయటం, మాట్లాడటం ఇవి అన్నీ కూడా సాధనలే వీటివలన మీ మనస్సులో ఉన్న ఇరుకుపోతుంది, మనస్సు విశాలమవుతుంది, ప్రేమలేనిమాట, ప్రేమలేనిపని వ్యర్థం, దాని వలన చేసేవాడికి వికాశం కలుగదు, ఉపకారం పొందేవాడికి కూడా వికాశం ఉండదు.

నా హృదయంలో ఏదో సత్యం ఉంది అని చెపుతున్నారు. అది నాకు గుర్తింపుకు రావటం లేదు. అది తెలిస్తే గాని నాకు జీవితంలో సంతృప్తి ఉండదు, అది తెలియకపోవటం వలన అసంతృప్తిగా ఉన్నాను. లోపల అసంతృప్తిగా ఉండి బయట తృప్తిగా ఉన్నాను అని చెప్పినా ప్రయోజనం లేదు. అంటే అప్పుడు భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీ తలంపులు

మాసిపోలేదు, నీ వాసనలు మాసిపోలేదు, అవే మన స్వరూపానికి మనలను దూరం చేస్తున్నాయి. మీరు జ్ఞానం సంపాదించటానికి వళ్ళంతా బాడి చేసుకోనక్కరలేదు. మీరు చేసే సాధన మీరు చేసుకోండి, ఒక గురుభక్తి వలన కూడా మీకు జ్ఞానం కలుగుతుంది. గాలి లేనిచోట దీపం ఎలా ఉంటుందో అలాగ గురువు పట్ల ఉన్న భక్తిలో, ప్రేమలో చలనం లేకుండా ఉండాలి అప్పడు మనకు జ్ఞానం కలుగుతుంది. గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే. మనం అనేక జన్మలు ఈశ్వరుడిని పూజించగా పూజించగా, ధ్యానించగా ధ్యానించగా మనలను గమ్యానికి చేర్చటం కోసం ఈశ్వరుడే ఒక రూపం ధరించి వస్తాడు, వాడే గురువు. గురువు పట్ల భక్తి కలగటం, ఆయన పాదాలయందు మనకు ఇష్టత కలగటం ఇవి అన్నీ కూడా ఆయన దయ వలననే కలగాలి గాని మన తెలివితేటల వలన కలిగేది కాదు. సాధ్యమయినంతవరకు రాగద్వేషములను తగ్గించుకొంటే మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. కాని దేహము నేను అనే తలంపు వలన దేహమే ఆత్మ, దేహమే సత్యం అనుకోవటం వలన మనం లోపలకు వెళ్ళలేకపోతున్నాము. అక్కడ నుండే అవిద్య, అజ్ఞానం ప్రారంభమవుతుంది. మనం బుడగను చూస్తున్నాము. బుడగకు ఆధారమైన నీటిని చూడలేకపోతున్నాము. అదే మాయ, అదే అజ్ఞానం. లోపల చైతన్యం లేకుండా, లోపల భగవంతుడు లేకుండా ఇందులో ఒక్క రూపం గాని, ఒక్క నామం గాని లేదు. మనం నామ, రూపాలను చూస్తున్నాము. ఈ నామరూపాలకు ఆధారంగా ఉన్న ఈశ్వరుడిని చూడలేకపోతున్నాము. అదే మాయ. ఈమధ్యన ఎవరో ఒక గురువుగారిని అడుగుతున్నారు. నేను కూర్చొన్నప్పడు జపం చేసుకుంటున్నాను, నడుస్తునప్పడు చేసుకోలేకపోతున్నాను అంటున్నారు. ఆగురువుగారు ఏమి చెపుతున్నారు అంటే నీవు కూర్చున్నప్పడు చనిపోతే ఫరవాలేదు, మరి నడిచేటప్పడు పనిచేసేటప్పడు చనిపోతే ప్రమాదంలో పడతావు ఆలోచించుకో అన్నారు. సాధన అనేది నిరంతరం జరగాలి. చెట్లు ఆకులు కొంచం కొంచం కదులుతున్నాయి అంటే అక్కడ గాలివీస్తోంది అని అర్థం. చిరుగాలి కూడా లేకపోతే అక్కడ ఆకులు కదలవు. మనకు ఏ అలవాటు, ఏ కోరిక లేకపోతే అసలు మనస్సును కదలమన్నా కదలదు. మీరు ఇంటి వద్ద వంటరిగా కూర్చొనప్పడు మీ మనస్సు కదులుతోంది అంటే దానికి మీ కోరిక గాని, మీ అలవాట్లు కాని కారణం. అలవాట్లు చాలా ప్రమాదం, అలవాట్ల వలన ఆరోగ్యం చెడిపోతుంది, ఇంట్లో ఉన్న డబ్బు కూడా పోతుంది. ద్వేషం కూడా ఒక పాడు అలవాటు. ద్వేషం ఉన్నవారు ఏమిచేస్తారు అంటే వారు బాగుపడకపోయినా ఫరవాలేదు, ఎవరి మీద అయితే వారికి ద్వేషం ఉందో వారుబాగుపడకూడదు అనుకొంటారు. ద్వేషం ఉన్నవాడికి నెగిటివ్ తింకింగ్ వచ్చేస్తుంది. మీ మీద నాకు ద్వేషం ఉంది అనుకోండి మీలో మంచి ఉన్నా అది నాకు కనబడదు, కారణం మీలో మంచి లేకపోవటం కాదు, నా ద్వేషం మీలో ఉన్న మంచిని చూడనివ్వదు.

భగవదనుభవం పొందటానికి అనేక మార్గాలు ఉన్నాయి. అందులో ఉదాత్తమైనది భక్తి మార్గము అని ఆచార్యులవారు చెప్పారు. స్వస్వరూప అనుసంధానమే భక్తి. గురువు యొక్క వాక్యాన్ని, శ్రుతియొక్క వాక్యాన్ని ముందు నువ్వు విశ్వసించి, దానిని ప్రాక్టీసు చేస్తే అలవాట్లు నశిస్తాయి. శ్రద్ధగా శ్రవణం చేయాలి. శ్రద్ధ లేనివాడికి జ్ఞానం రాదు, వినయం లేనివాడికి వినాలనిపించదు. మనం అజ్ఞానంలో ఉన్నట్లు చాలామందికి తెలియటంలేదు. శరీరంలో ఏదైనా రోగం ఉంటే అది తెలియటం మంచిది, తెలిస్తే అందులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేస్తాము. అలాగే అజ్ఞానంలో ఉన్నాము అని మనకు తెలియటం మంచిది,. తెలిస్తే కనీసం అందులోనుండి బయటకురావటానికి ప్రయత్నం చేస్తాము. అజ్ఞానంలోఉండి అజ్ఞానము లేదు అనుకొంటే ప్రమాదంలో పడతాము. గురువు ఏమి చేస్తాడు అంటే నీకు చైతన్యం గురించి బోధిస్తాడు, బోధించటమే కాదు దానిని ఎలా పొందాలో నిర్ధేశిస్తాడు. మనలోపలఉన్న చీకటిని పోగొట్టేవాడే గురువు. గురువు ఒకోసారి ఏమి చేస్తాడు అంటే మిమ్మల్ని ఇరుకున పెడతాడు. అప్పడు మీకు ఏమి అనిపిస్తుంది అంటే ఏమిటి గురువు ఇలా మనలను ఇరుకున పెడుతున్నాడు అనిపిస్తుంది. అలా గురువు ఇరుకున ఎందుకుపెడతాడు అంటే మీకు జ్ఞానోదయం కలగటానికి ఆసందర్భాన్ని ఉపయోగించుకొంటాడు., అంతేగాని మీ మీద కోపంతోకాదు, తొందరగా హృదయంలోనికి మిమ్మల్ని తీసుకోవటానికే ఇవి అన్నీ చేస్తాడు. ఈశ్వరుడు మనలను తీసుకొంటే మనం హృదయంలోనికి వెళ్ళగలము గాని కేవలము మన తెలివితేటల వలన హృదయంలో ప్రవేశించలేము. అంతా ఈశ్వరుడే. ప్రారబ్దంలేకుండా ఏ దేహం భూమి మీదకు రాదు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. ప్రారబ్దాన్ని బట్టి ఒకోసారి దుఃఖం వస్తుంది, ఒకోసారి సంతోషం వస్తుంది. యిష్టంగా, శాంతిగా ప్రారబ్దాన్ని అనుభవించు. ప్రారబ్దాన్ని అనుభవించేటప్పడు ఆ బాధ తట్టుకోలేక ఎప్పడైనా నీ మనస్సు చెదిరిపోవచ్చు. ఈశ్వరానుగ్రహం వలన మరల అది కండిషన్‌లో పడిపోతుంది. తొందరపడవద్దు. బాధపడవద్దు. కష్టం వచ్చిందని ఈశ్వరుని పాదాలువిడిచిపెట్టవద్దు. అత్తగారు ఏమైనా అంటే కోడలు తట్టుకోలేదు, కోడలు ఏమైనా అంటే అత్తగారు తట్టుకోలేదు. ఈ బాధలు, ఘర్షణలు, విరోధాలు, స్నేహాలు ఈ జీవకోటి అంతా చైతన్యస్రవంతిలో తిరుగుతున్నాయి.

రమణ భాస్కర

ఇది అంతా సృష్టిలో ఒక భాగము. చైతన్యముతో తాదాప్యం మనం విడిచిపెట్టకుండా ఉంటే సృష్టిలో జరిగే సంఘటనల ప్రభావము మన మీద పడదు. మీరు మీ కోడలను అన్నా, మీ కోడలు మిమ్మల్ని అన్నా ఇదంతా ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. చైతన్యానికి తెలియకుండా ఈ సృష్టిలో ఏమీ జరగదు. నీరుకు సంబంధం లేకుండా బుడగలేదు, నురుగు లేదు, కెరటం లేదు. అంతా నీరే. అలాగే చైతన్యాన్ని విడిచిపెట్టి ఈ సృష్టిలో ఏమీ లేదు. మీరు మనస్సును అటుతిప్పకండి, చైతన్యం వైపు త్రిప్పండి. ఒకవేళ ఇటు తిప్పినా కెరటంలోను నీరునే చూడండి, బుడగలోను నీరునే చూడండి, నురుగులోను నీరునే చూడండి అలాగే ఈ సృష్టిలో ఏది చూసినా దానికి ఆధారంగా ఉన్న చైతన్యాన్ని చూడండి. ఈ చనిపోవటాలు, పుట్టటాలు ఇవిఅన్నీ చైతన్యానికి తెలియకుండా జరగటం లేదు. మన శరీరానికి వచ్చే జబ్బు పెద్దజబ్బు కాదు, ఈ చనిపోవటం, పుట్టటం అదే పెద్దజబ్బు. ఈ పెద్దజబ్బులోనుండి బయటపడేవరకూ మిగతా జబ్బులు అలా వస్తూనే ఉంటాయి. మాకు శాంతి లేదు అని కొంతమందిఅంటూఉంటారు. మాకు శాంతి లేదు అంటే అక్కడ మీకు వ్యక్తిభావన ఉందని అర్థం. అందరూ మమ్మల్ని గౌరవించాలి అని కొంతమంది అనుకొంటూ ఉంటారు, చివరకు వారు పిచ్చివారు అవుతారు. మన కళ్లతోటి మనం చూసుకోవాలి గాని ఇతరుల కళ్లతో ఎంతసేపు చూసుకొంటాము. మనకళ్లతో మనం చూసుకోవాలి, మన కాళ్లతోమనం నడవటం నేర్చుకోవాలి, మన లోపల ఏమి జరగుతోందో మనస్సుతో పరిశీలన చేసుకోవాలి. మన కాళ్లతోమనం నడుస్తూఉంటే, మనం సొంతబుద్దిని విడిచిపెట్టకుండా ఉంటే ఏనాటికయినా మనం వివేకవంతులం అవుతాము, సుఖపడతాము, ఆత్మజ్ఞానసముపార్జనకు అర్హులమవుతాము. ఎక్కడయితే మమత ఉందో అక్కడ దాని తాలుక జ్ఞాపకం ఉంటుంది. మనకు ఇష్టంలేనిది ఎక్కడ మననం చేస్తాము. ఈశ్వరుడుఅంటే మనకు మమత ఉంది అనుకోండి నిరంతరం మనకు ఈశ్వరుడు గుర్తులో ఉంటాడు. లోకం అంటే మనకు మమత ఉంది అనుకోండి. నిరంతరం మనకు లోకం గుర్తులో ఉంటుంది. శరీరం ఉన్నచోట మనం ఉండము, మనస్సు ఎక్కడ ఉంటే మనం అక్కడ ఉంటాము. ఎక్కడయితే మమత ఉంటుందో అక్కడ మన మనస్సు ఉంటుంది. మనస్సును జయించలేకపోతున్నారు అనుకోండి, దాని గొడవ వదిలెయ్యండి. నామరూప దృష్టి తగ్గించుకోండి. ఈ మాటలు వింటే చెడిపోతామని కొంతమంది అనుకోవచ్చు. మీరు చెడిపోరు, సుఖపడతారు. మీ ఆస్థిఅంతస్థులు తీసుకురాలేని సుఖం ఈ మాటలు తీసుకొనివస్తాయి, మీ చైతన్యస్థాయి పెరుగుతుంది, వివేకవంతులవుతారు, ఇంతకు ముందు మీరు ఏపని అయితే చేస్తున్నారో ఆ పనిని ఇంతకుముందు కంటే బాగా, సమర్థవంతంగా



చేయగలరు. సన్యాసం అంటే పని విడిచిపెట్టటం సన్యాసం కాదు, ఇల్లు విడిచిపెట్టటం సన్యాసం కాదు, దేహము నేను అనే తలంపును విడిచిపెట్టటమే సన్యాసం అన్నారు భగవాన్. ఏ నేను అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో, మనస్సుతో తాదాప్యం పొందుతోందో ఆ నేనును త్యాగం చేయటమే సన్యాసం, ఏదైతే నీవుకాదో దానిని విడిచిపెట్టటమే సన్యాసం. నీవు ఎర్రబట్టలు కట్టుకొన్నా తెల్లబట్టలు కట్టుకొన్నా నీవు చేయవలసింది అదే. దేహప్రారబ్దమును బట్టి కొంతమంది సన్యాసాశ్రమంలో, కొంతమంది గృహస్థాశ్రమంలో ఉంటారు. సన్యాసాశ్రమంలో ఉన్నంత మాత్రం చేత జ్ఞానం రాదు. నీవు కాని దానితో నీకు ఉన్న తాదాప్యం విడిచిపెట్టాలి. అది నీవు గృహస్థాశ్రమంలో ఉన్న, సన్యాసాశ్రమంలో ఉన్నా చేయవచ్చు. చదువవలెను, చదువవలెను చావులేని చదువు చదువవలెను అన్నాడు ప్రహ్లాదుడు. ఏ చదువు అయితే నిన్ను చావులేనిస్థితికి తీసుకొని వెళుతుందో ఆచదువు చదవాలి, అదే నిజమైనచదువు అని చెప్పాడు. ఎప్పడైనా మీకు సంతోషం వస్తోంది అనుకోండి, కోపం వస్తోంది అనుకోండి, మమకారం వస్తోంది అనుకోండి ఇవన్నీ నిజంకాదు, ఇవన్నీ ఫీలింగ్స్ మాత్రమే అన్నారు భగవాన్. నీలోపలఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వచ్చేవరకు సత్యంకాని ఈ ఫీలింగ్స్ ఈజన్మలోనే కాదు రాబోయేజన్మలో కూడా నిన్ను వెంటాడుతూ ఉంటాయి. నేను చాలా కాలంనుండి చూస్తున్నాను మీకు తిక్కలేదు, తిక్కరావటం లేదు ఏమిటి అని ఒక ప్లీడరు గారిని అడిగాను. తిక్కవస్తే నేను పాడైపోతానని నాకు తెలుసు అందువలన తిక్కరాకుండా చూసుకొంటున్నాను అని చెప్పారు. కొంతమంది సాధన చేస్తూ ఉంటారు కాని తిక్కలు ఉంటాయి. ఆ తిక్క ఉన్నవారు బాగుపడరు. ఒకవేళ తిక్కవచ్చింది అనుకోండి అదొక ఫీలింగ్. ఒకవేళ కోపం వచ్చింది అనుకోండి అదొక ఫీలింగ్, ఈ అసత్యమైన ఫీలింగ్స్ మిమ్మల్ని విడిచిపెట్టవు ఎందుచేతనంటే హృదయంలోఉన్న సత్యంతో మీకు తాదాప్యం లేదు. సత్యానుభవం కలిగేవరకూ అసత్యం తాలుక ఫీలింగ్స్, అసత్యం తాలుక ఉద్రేకాలు నిన్ను వెంటాడుతూ ఉంటాయి. సత్యం గురించి వింటే చాలు కొంతమందిలోపలకు వెళ్ళిపోతారు అంటే లోపల ముగ్గిపోయి ఉంటారు. కొంతమంది వేదాంత పుస్తకాలు చదివి భగవాన్ దగ్గరకు వెళ్ళి నన్ను నేను తెలుసుకోవాలని ఉంది అనేవారు. నన్ను నేను తెలుసుకోవటం అంటే అక్కడ ఎంతమంది ఉన్నారు అనిభగవాన్ అడిగారు. తెలుసుకోబడేవాడు, తెలుసుకొనేవాడు ఇద్దరు ఉన్నారు. ఆ తెలుసుకొనేవాడిని తీసెయ్యి ఇంక ఏమీ లేదు అనేవారు భగవాన్. నువ్వు రెండుగా ఉన్నావా? ఒకటిగా ఉన్నావా? ఒకటిగానే ఉన్నావు. రెండుగా ఉన్నాను అనుకొనేది నీ ఊహ, నీ కల్పితం. సాధన చేస్తే కల్పితం పోతుంది. మాకుకృష్ణుడు కనిపించాడు, రాముడు కనిపించాడు అని

కొంతమంది చెపుతున్నారు అది నిజమేనా అని అడుగుతున్నారు. నీ శరీరము నాకు కనిపిస్తోంది, నా శరీరము నీకు కనిపిస్తోంది, అలాగే భక్తుడికి కృష్ణుడు ఒక శరీరం కింద కనిపించవచ్చు, కనిపించినా ఆ శరీరం కృష్ణుడు కాదుకదా, ఈ రూపాల గొడవనీకు ఎందుకు లోపలకు వెళ్ళపో అంటున్నారు. నీ శరీరము నువ్వుకానప్పడు ఆయన శరీరం ఆయన ఎలా అవుతాడు. మనస్సు ఎక్కడయితే అణిగిందో అక్కడ నుండి మౌనం వస్తుంది, ఆ మౌనం బోధిస్తుంది. అది సూక్ష్మబుద్ధి ఉన్నవాడికి తెలుస్తుందిగాని స్థూలబుద్ధి ఉన్నవాడికి ఆబోధ అందదు. మనందరకు సత్యాన్ని తెలుసుకోవాలని ఉంది కాని అహంకారాన్ని విడిచిపెట్టకుండా అహంకారముతో తెలుసుకోవాలని ఉంది. అహంకారాన్ని విడిచిపెట్టటం మనకు ఇష్టంలేదు ఎందుచేతనంటే అదే మనం అనుకొంటున్నాము. భగవంతుడు నీకు ఏపని అయితే ఇచ్చాడో దానిని నిర్మలంగా చేసుకొని వెళ్ళిపో. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. ఐశ్వర్యంకూడా నీ తెలివితేటల వలన రాదు. ఒక ప్రారబ్ధం ఐశ్వర్యాన్ని తీసుకుని వస్తుంది, మరల ఐశ్వర్యం పోయినప్పడుకూడా ఒక ప్రారబ్దం తీసుకొని పోతుంది. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే మనకు తాడే పాము క్రింద కనిపిస్తోంది. తాడంటూ ఒకటి ఉంది కాబట్టి అదే పాము కింద మనకు అనిపిస్తోంది. అలాగే చైతన్యం ఉంది కాబట్టి మీకు అహంకారం ఉందని అనిపిస్తుంది. ఆ పాము ఎంతనిజమో ఈ అహంకారం కూడా అంతేనిజం. ఈ మాటలు మీరు అర్థం చేసుకోకుండా మేము ధ్యానం చేసేస్తాము, మేము ధ్యానం చేసేస్తాము అంటున్నారు. ధ్యానం చేద్దురుగాని ముందు సబ్జక్టు సరిగా అర్థం చేసుకోండి. తాడుపాము కింద ఎలాకనిపిస్తోందో అలాగే బ్రహ్మంలో నీకు అహంభావన కనిపిస్తోంది. ఈ కనిపించేదానిని పోగొట్టుకోవటానికి ఎన్ని ప్రయత్నాలు చేస్తావు, ముందు అది లేదని నువ్వు అర్థం చేసుకో. సబ్జక్టు ప్రోపర్‌గా అర్థమయితే వెయ్యిజన్మలు తపస్సు చేసిన ఫలితం మీరు పొందుతారు. అవగాహన లేకుండా, ఆలోచన లేకుండా మేము ధ్యానం చేసేస్తాము, తలుపులు మూసేసుకుంటాము. ఇంట్లో ఎవరైనా చప్పడు చేస్తే కుదరదు అంటే ఎలాగ? వాడు ధ్యానం చేసుకొంటున్నాడుఅట పిల్లి కనబడకూడదు, కుక్క మొరగకూడదు, ఇంట్లో పిల్లలు ఏడవకూడదు అంటే ఎవడు పట్టుకొంటాడు. ఇంట్లో పనులు మానేసి ఈ ధ్యానం చేసేవాడి కోసం కాపలా ఎవరు కాస్తారు. తలుపు చప్పడు అయితే విశ్వామిత్రుడు అయిపోతాడు, నాధ్యానం చెడగొడతావా అని కోపంగా బయటకు వచ్చేస్తాడు, అంటే లోపల కోపం నేర్చుకొంటున్నాడు. కనిపించే మనుషులు అంటే వాడికి ఇష్టం ఉండదు, ఎక్కడో కనిపించని దేవుడు అంటే నాకు ఇష్టం అంటాడు.



నీవు ఆత్మవే, నీవు దేహాన్ని అనుకొన్నప్పడు, మనస్సు అనుకొన్నప్పడు కూడా నీవు ఆత్మవే. నేను దేహాన్ని అనుకొన్నప్పడు దేహం పుట్టినప్పడు పుట్టాను, దేహం చనిపోయినప్పడు చనిపోతున్నాను అనుకొంటున్నావు. నేను మనస్సును అనుకొన్నప్పడు మనస్సులోనికి వచ్చేగుణాలు నీవే అనుకొంటున్నావు. ఇలా నీవు కానిదానిని నీవు అనుకోవటం వలన ఇన్ని తిప్పలు వస్తున్నాయి. మీకు నిజం తెలియకపోవటం వలన నిజం కాని దానిని నిజం అనుకొంటున్నారు. అసలు ముందు మీకు ఒక స్పష్టత రావాలి. జ్ఞానం అంటే ఏమిటి? చావులేని స్థితి అంటే ఏమిటి అని దాని తాలుక స్పష్టత కనుక మీకు బ్రెయిన్‌లోనికి వస్తే మీరు కానిదానిలో నుండి సహజంగానే విడిపోతారు. ఏతలంపులు లేనిస్థితే నిజమైనస్థితి. గాఢనిద్రలో మనం ఉన్నాము కాని అక్కడ తలంపులు లేవు, చావుపుట్టుకలతో సంబంధంలేదు. అక్కడ మనం సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము. గాఢనిద్రలో మనకు వేరుభావన లేదు. జాగ్రదవస్థలో తలంపులు వచ్చాక వేరుభావన వస్తోంది, మనకు పనికిరాని విషయాల గురించిన ఎరుకలన్నీ వస్తున్నాయి. ఏదైతో ఉందో దాని తాలుక ఎరుకలేదు. పనికిరానివి అన్నీ ఉన్నాయి, పనికి వచ్చేది ఏదీ లేదు. గాఢనిద్రలో మనం సుఖంగా ఉన్నాము, ఎరుక లేదు. జాగ్రదవస్థలో ఎరుక ఉంది, సుఖంగా లేము. గాఢనిద్రలో ఉన్న సుఖం జాగ్రదవస్థలో ఉన్న ఎరుక ఒకేసారి నీకు అనుభవంలోనికి వస్తే నీకు జ్ఞానోదయం అవుతుంది. నీవు ఎలాగ ఉన్నావో అలాగ ఉండగలవు.

నాకు మనస్సును వదిలించుకోవాలని ఉంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మనస్సునీవు కాదు నీవు కానిదాని గొడవ నీకు ఎందుకువయ్యా. మనస్సును వదిలించుకొంటాను అంటున్నావు. వదలించుకొన్నా, వదిలించుకోకపోయినా అది నీవు కాదు. దాని గొడవనీకు ఎందుకు? గాఢనిద్రలో అది నిన్ను వదలేసి పోతోంది కదా ఇంక నీకు దాని గొడవ ఎందుకు? దాని గొడవ వదిలెయ్యి. నీ హృదయంలో ఒక సత్యం ఉంది. దానిని చూడటం నేర్చుకో. ఇది పత్తాలేకుండా పోతుంది. మీ ఇంటికి ఎవడైనా చుట్టం వస్తే వాడినికొట్టనక్కరలేదు, పొమ్మని చెప్పనక్కరలేదు. మీరు గౌరవించటం మానివేస్తే వాడే పోతాడు. అలాగే మనస్సును పట్టించుకోవద్దు దాని గొడవ వదలెయ్యండి, అదే పోతుంది అంటున్నారు భగవాన్. మీరు దానిని పట్టించుకొని ముస్తాబు చేస్తూ ఉంటే అది ఎక్కడికి పోతుంది. మీరు దానిని పట్టించుకోవటం మానివేసి, నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక స్ఫురణలో ఉండు, దాని తాలుక ఎరుకలో ఉండు అప్పడు మనస్సు పత్తాలేకుండా పోతుంది. అంతేగాని నీవు

ఉన్నావు, నీవు ఉన్నావు అని పదిసార్లు అంటే నేను ఉన్నాను అని మనస్సు అంటుంది. మొక్కకు నీళ్ళుపోస్తూ ఉంటే అది చావమంటే ఎలా చస్తుంది, చావదు. దానికి నీరుపోయటం మానేస్తే అది చనిపోతుంది. అలాగే నీవు మనస్సును పట్టించుకోకుండా ఉండు, ఏదో రోజున అదే పోతుంది. నువ్వు ఏదైతే అవునో దాని తాలుక గుర్తింపులో ఉండు, దాని తాలుక ఎరుకలో ఉండు, నీవు ఎలాగ ఉన్నావో అలాగ ఉండు, నీవు కానిదంతా పోతుంది, ఇది రమణబోధ. నీకు సుఖంకావాలి, శాంతికావాలి. ఆనందం కావాలి. మానవుడు ఏపనిచేసినా ఆనందం కోసం చేస్తాడు. మాట్లాడితే ఆనందం కోసం మాట్లాడతాడు. సినిమాకు ఎందుకు వెళుతున్నారు? ఆనందంకోసమే. అక్కడ ఆనందం ఉన్నా, లేకపోయినా మానవుడు ఏపని చేసినా అక్కడ ఆనందం ఉందనుకొని చేస్తాడు. ఆనందం ఈ సృష్టిలో ఎక్కడా లేదు, ఆనందం నీ హృదయంలోనే ఉంది, నీ హృదయంలో ఉండటమే కాదు, అది నీవై ఉన్నావు. నీ స్వరూపమే ఆనందం, అందువలన నీవు ఆనందాన్ని కోరుకొంటున్నావు. నీ స్వరూపం యొక్క సహజస్థితి ఉండటమే అందుచేతనే అందరికీ ఉండాలని ఉంది. మీ స్వరూపంలో ఏది ఉందో అదే మీరు కోరుకుంటున్నారు. మీ స్వరూపంలో దుఃఖం లేదు అందుచేత దుఃఖం వస్తూఉంటే వద్దు వద్దు అంటారు. అంటే మీకు తెలియకుండా మిమ్మల్ని మీరు వెతుక్కుంటున్నారు. ఆనందం నీ హృదయంలో ఉంది. నీ మనోప్రవాహాన్ని ఎవడైతే హృదయంవైపుకు మళ్ళిస్తున్నాడో వాడే గురువు. చేతిలో ఉన్న మిఠాయిని కిందపడేసి, చేతికి అంటుకొన్న దానిని నాకటం ఎటువంటిదో హృదయంలో ఉన్న ఆనందాన్ని వదిలేసి ఆనందం కోసం బజారులోపడటం కూడా అటువంటిదే. హృదయంలో ఉన్న ఆనందాన్ని అనుభవించేకొలది ఎప్పటికప్పుడు అది కొత్తగా ఉంటుంది, ఏక్షణానికి ఆక్షణం అది నిత్యనూతనం, అట్టిది ఆ ఆనందం, దానికి హద్దులు లేవు, ఏపరిమితులు లేవు. పశువు ఎవడు అని ఒక మహాత్ముడు ప్రశ్న వేసి, సమాధానం కూడా ఆయనే చెప్పాడు. నేను అజ్ఞానంలో ఉన్నాను. అజ్ఞానంలో నుండి ఎలా విడుదల పొందాలి అని ప్రయత్నంచేసేవాడు పశువు కాదు, నేను అజ్ఞానములో ఉన్నాను అని కనీసం గుర్తింపు కూడా లేకుండా ఎవడైతే ఉన్నాడో వాడు పశువు. అజ్ఞానంలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నం చేయటం మాట అటుంచండి, కనీసం నేను అజ్ఞానంలో ఉన్నాను అనే గ్రహింపు లేనివాడు, ఆ ఎరుక లేనివాడు పశువు. జ్ఞానికి శరీరం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. శరీరం ఉంటే దానికి చాకిరీ చేయాలి. జ్ఞానికి శరీరం లేకపోయినా తన అస్థిత్వానికి భంగం లేదు. శరీరం ఉన్నప్పడు కూడా వారు శరీరం కాదు. వారి ద్వారా ఏ శక్తి అయితే పనిచేస్తోందో ఆశక్తికి చావులేదు, శరీరం లేకపోయినా అది పనిచేస్తూనే ఉంటుంది. మీరు అందరూ మంచి



మార్గంలో ఉన్నారు. మీరు అవగాహన పెంచుకోండి. అర్థం చేసుకునేశక్తిని పెంచుకోండి. అర్థం చేసుకోవటం కూడా ఒక యోగం. సబ్జక్టును ప్రోపర్‌గా అర్థంచేసుకోవటం వలన మీ ప్రయాణం తేలిక అవుతుంది.

.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 25-4-03, పోడూరు.**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం బాహ్యంగా సాధించవలసింది అంటూ ఏమీలేదు, ఏదోఉందని మనమనస్సుకు అనిపిస్తూ ఉంటుంది. మన గమ్యం, మనం సాధించవలసింది మన హృదయంలోనే ఉంది. అది తప్పించి బాహ్యంగా ఏది సాధించినా స్వప్నంతో సమానము. మన చేతులకు చిప్పలు వచ్చినా, మన పెట్టెలోనికి లక్షలు వచ్చినా రెండూ స్వప్నంతో సమానము. దేహం ప్రారబ్ధాన్నిబట్టి వచ్చింది. భగవంతుడు మనకు ఇచ్చిన పనిని ఇష్టంగా, ప్రేమగా చెయ్యటం మంచిది. మీరు తొందరపడవద్దు, అశాంతి తెచ్చుకోవద్దు. మీదేహప్రారబ్ధములో ఏది ఉంటే అది నిర్మలంగా అనుభవించండి, అనుభవిస్తే అది పోతుంది. మనకళ్ళకు కనబడేది ఏదీ నిజంకాదు, బ్రహ్మం ఒక్కటే సత్యం. జగత్తు జగత్తుగా నిజంకాదు, బ్రహ్మంగా నిజం. దేహగతమైన నేను ఉన్నంతకాలం బాహ్యసంఘటనల ప్రభావం మనమీద పడకుండా ఆపుచేసుకోలేము. ఎప్పుడయితే దేహగతమైననేను నశించిందో బాహ్యసంఘటనల ప్రభావం మీమీద ఉండదు. ఏవిషయం గురించి మీరు భయపడవద్దు. భయం వలన అశాంతి వస్తుంది. భగవంతుడికి తెలియకుండా ఏవిషయం జరగటంలేదు. కొంతమంది అసూయపరులు ఉంటారు, భగవంతుడి పట్ల కొంచెంకూడా విశ్వాసంలేనివారు ఉంటారు. మనం పామును చూసి ఎలా పారిపోతామో అలాగ అసూయపరుల దగ్గరనుండి, భగవంతుడిపట్ల విశ్వాసంలేనివారి దగ్గరనుండి పారిపోవటం నేర్చుకోవాలి. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు, ఆయనను అనుభవంలోనికి తెచ్చుకోవటమే మన జీవితగమ్యం. భగవంతుడి సంకల్పాన్ని కాదని మనం చేసేది ఏమీలేదు. ఈసృష్టి అంతా భగవంతుడి సంకల్పాన్ని బట్టి నడుస్తోంది. ఆయనను కాదని ఈసృష్టిలో ఏది జరగటానికి ఆవకాశం లేదు. ఈవాక్యం అర్థం చేసుకొంటే మనకు దుఃఖం వెంటనే నశిస్తుంది. స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. ఆధ్యాత్మికంగానే కాదు భౌతికంగా కూడా చాలామంది పతనమవ్వటానికి స్నేహాలేకారణం. లోపలఉన్నఈశ్వరుడితో అనుబంధం పెట్టుకోవాలి. ఏదో మంత్రం ద్వారా అనుసంధానం పెట్టుకోవాలి. మీరు ఏకాంతంగా

కూర్చొని భక్తిగా శ్రద్ధగా ఆమంత్రాన్ని జపిస్తూ ఉంటే లోపలఉన్నసృష్టికర్తతో అనుబంధం ఏర్పడుతుంది. ఒకవేళ మీకు ఏదైనా కోరికలు ఉన్నాయి అనుకోండి, ఆకోరికలుకూడా నెరవేరతాయి. మనం ఆలోచనల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. ఎందుచేతనంటే మనం ఆలోచించేదే మనం అవుతాము. నీవు జీవితం పొడుగునా ఏదైతే స్మరిస్తున్నావో, దేనిగురించి అయితే ఆలోచిస్తున్నావో, దేనిగురించి అయితే మాట్లాడుతున్నావో, దేనిగురించి అయితే జీవిస్తున్నావో అదే నీ ప్రాణప్రయాణసమయంలో గుర్తుకు వస్తుంది. అంతేగాని జీవితం పొడుగునా ఒకదాని గురించి ఆలోచించి, ప్రాణప్రయాణ టైములో యింకొకటి గుర్తుకురావాలంటే రాదు. అందుచేత ఇప్పటినుండి జాగ్రత్తగా సాధన చేసుకో. లోపల అమృతానుభవంలేనప్పడు మనకు ఎంత ధనంఉన్నా, ఎంత పాండిత్యం ఉన్నా ఏమీప్రయోజనం లేదు, అవి అన్నీ స్వప్నతుల్యము. హృదయంలో మనస్సును నిలబెట్టి ఉంచాలి అని అందరికీ ఉండవచ్చు కాని అలా అనుకోవటం వలన ప్రయోజనంలేదు. భోగకాంక్ష నీకు బలీయంగా ఉన్నప్పడు నువ్వు మనన్సును హృదయంలో నిలబెట్టాలనుకొన్నా అది నీకు సాధ్యంకాదు. భోగకాంక్ష నీమనస్సును బయటకు తీసుకొని వచ్చేస్తుంది. మనస్సు బయటకు వెళితే దుఃఖం లోపలకు వెళితే ఆనందం, మనస్సు బయటకు వెళితే అజ్ఞానం, లోపలకు వెళితే జ్ఞానం. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టు. ఏసంఘటన ఎందుకు జరుగుతోందో మనకు తెలియదు. మనకు ఏది మంచిదో మనకంటే ఈశ్వరుడికి బాగాతెలుసు. మీలో పునర్జన్మ హేతువులు ఉన్నప్పడు లేవులేవు అని అనుకొన్నా భగవంతుడు మోసపోడు, మీలోపల ఏమి ఉందో ఆయనకు తెలుసు, మీలోపల అంతర్యామిగా ఉన్నవాడు ఆయనే. బలిచక్రవర్తి రాక్షసవంశమయినా ఉత్తముడు. ఎంతమంచితనం ఉన్నా లోపల దేహమునేను అనే తలంపు, దేహమునాది అనే తలంపుపోవటం కష్టం. మహావిష్ణువు వామనరూపంలో వచ్చిమూడుఅడుగులు దానం అడుగుతాడు. రాక్షసగురువు చెపుతాడు వచ్చినవాడు భగవంతుడు, మామూలు వాడు కాదు, వాడితో జాగ్రత్త, వాడు దానం అడుగుతాడు ఇవ్వవద్దు అని చెప్పాడు. బలిచక్రవర్తి ఏమిఅన్నాడు అంటే భగవంతుడు అంతటివాడు నాదగ్గరకు వచ్చిదానం అడిగితే ఇవ్వకుండా ఎలా ఉంటాను అన్నాడు. గురువు చెప్పినప్పటికీ వినలేదు. దానం ఇస్తాను అంటాడు ఆయన ఒక అడుగుతోటి భూమి, ఇంకో అడుగుతోటి ఆకాశం అంతా వ్యాపించాడు. మరిమూడో అడుగు ఎక్కడపెట్టమంటావు అని అడిగితే నానెత్తిమీద పెట్టుఅంటాడు. అతను మనకు మంచివాడే, గొప్పవాడే కాని లోపల నేను అనే తలంపు అతనికి పోలేదు, అది అతనికి తెలియదు. మహావిష్ణువు అతని శిరస్సుమీద మూడోపాదం పెట్టి నేను అనే తలంపును తీసేసాడు. అంటే భగవంతుడు



చేసేపనులు బాహ్యంగా మనకు విరోధంగా చేస్తున్నాడు అని అనిపించినప్పటికీ మనకు మంచిచేస్తాడు. వాడు దేవుడు. మన మనస్సు బాహ్యవిషయాల మీదకు వెళుతూఉంటుంది. ఇలా బాహ్యంగా వెళుతున్న మన మనస్సును వెనుకకు తిప్పి భగవంతుడి మీద నిలబెట్టి ఉంచటమే తపస్సు. భోగచింతన తగ్గించుకొని దైవచింతన పెంచుకోవాలి, భోగమేరోగం క్రింద మారుతుంది.

మీకు జపం ఇష్టమయితే జపం, ధ్యానం ఇష్టమయితే ధ్యానం, విచారణ ఇష్టమయితే విచారణ చేసుకోవచ్చు. ఎవరిపద్ధతిలో వారు సాధన చేసుకోవచ్చు కాని అనుకరణ పనికి రాదు. ప్రతీవిషయానికి అనుకరణచేస్తూ ఉంటే మీకు ఆత్మవిశ్వాసంలేదు అని అర్థం. ఆత్మవిశ్వాసం లేనివారికి భయంకలుగుతుంది. భయం వలన అశాంతి వస్తుంది, గందరగోళం వస్తుంది, తరువాత బుద్ధి పాడవటం ప్రారంభమవుతుంది. ఈశ్వరుడి మీద మనకు ఉండవలసినంత విశ్వాసం లేకపోవటం వలన జీవుడిని భయం వెంటాడుతుంది. మనందరము చేస్తున్న పొరపాటు ఏమిటి అంటే మనం గుడికి వెళతాము అది అడుగుతాము, ఇది అడుగుతాము. కాని లోపల దేహము నేను అనే తలంపు ఉంది, ఆదేహగతమైననేనులో నుండి నన్ను విడుదలచెయ్యమని ఎవరూ భగవంతుడిని ప్రార్థనచేయటంలేదు. ఈ ప్రపంచంలోనికి వచ్చినందుకు మనపని ఏదో మనం చేసుకొని పోవాలి గాని మనం అందరినీ ఉద్ధరించేయాలి అనేభావన మంచిదికాదు. కుక్క తోకవంకర తీయాలి అనుకోవటం ఎటువంటిదో మొత్తం సమాజంలో అందరినీ సమానం చేసేయ్యాలి అనుకోవటం కూడా అటువంటిదే. ఎందరో మహాత్ములు వచ్చారు ఎవరూ సమాజాన్ని సమానం చేయలేదు, అది ఈశ్వరనిర్ణయం. ఎక్కడో సమాజం దాకా ఎందుకు మీ కుటుంబసభ్యులు అందరూ సమానంగా ఉన్నారా? వారి గుణాలు తేడా, రంగులుతేడా, ఐశ్వర్యంతేడా, జ్ఞానం తేడా అన్నీతేడాయే ఇంక సమాజాన్ని అంతా సమానం చేయటం ఎలా సాధ్యమవుతుంది. నేను ఏదో సమాజాన్ని ఉద్ధరించేస్తాను అనే భావన పెట్టుకోవద్దు, నీకు చేతనైనంతవరకు సమాజానికి సహకరించు, దాని వలన నీవు పవిత్రుడవు అవుతావు. మీరు ఏదిచేసినా ప్రేమగా చెయ్యండి, వ్యక్తులను చూడవద్దు అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని చూసిచెయ్యండి. అప్పడు ఈశ్వరుని దయకు పాత్రులవుతారు అప్పడు రాగద్వేషములు రావు, మనస్సు సమానం అవుతుంది. సమానమైన మనస్సుకు యోగం చేయటానికి అర్హత కలుగుతుంది. యోగంలో సక్సెస్ అవ్వటానికి సమానబుద్ధిఅవసరం. నామస్మరణ అంటే తక్కువ అని అనుకోవద్దు. భగవంతుని నామాన్ని స్మరించటం వలన మనం

పవిత్రులమవుతాము. నామస్మరణ వలన అంతర్యామిగా ఉన్న ఈశ్వరునితో అనుసంధానం ఏర్పడుతుంది.

జ్ఞానం అనేది గురుకృపవలననే సాధ్యం, ఆనందం గురువు యొక్క అనుగ్రహం వలననే సంభవం అని భాగవతంలో చెప్పారు. అందుచేత మీరు నన్ను అనుగ్రహించండి అని ఒక భక్తుడు భగవాన్‌ని అడుగుతున్నాడు, భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే యిచ్చే వాడు ఎవడు, పుచ్చుకొనేవాడు ఎవడు అంతా నీలోపలే ఉంది. ఎక్కడ రేవు పెట్టినా అద్వైతానుభవంలోనికి తీసుకొని వచ్చేస్తారు, ద్వైతభావన అక్కడ నిలబడనివ్వరు. ఇచ్చేవాడు ఈశ్వరుడే, పుచ్చుకొనే వాడు ఈశ్వరుడే, అంతా ఈశ్వరుడే. గురువు యొక్క అనుగ్రహం వలన ఆనందం కలుగుతుంది అని చదివాను అంటున్నావు. నీలోపల ఒక సద్వస్తువు ఉంది. దాని స్వరూపమే ఆనందం, ఆనందం దానిని విడిచిపెట్టి లేదు. మీరు చెపితే వినటానికి బాగానే ఉంది కాని లోపలఉన్నఆనందం నాకు అందటంలేదు అంటున్నాడు. ఎందుచేత అందటంలేదు అంటే నీవు ఏదిగా ఉన్నావో అది నీవు అనుకోవటం లేదు. నీవు కానిదేహాన్ని, నీవుకాని మనస్సును నీవుఅని అనుకొంటున్నావు, వాటితో జతకడుతున్నావు, నువ్వుకానిదానితో కలిసి తిరుగుతున్నావు, ఏదైతే అవునో దానిని వదిలేసావు, దానిని మర్చిపోయావు అందువలననే నీ లోపల ఆనందం ఉన్నా అది నీకు తెలియటంలేదు. నీవు రాంగ్ తింకింగ్ వదులుకో, రాంగ్ తింకింగ్ వలన దుఃఖం వస్తుంది. నీవు ఏదైతే అవునో దానితో నీకు తాదాప్యం లేదు, చనిపోయే శరీరంతో తాదాప్యం పొందుతున్నావు. అన్ని కాలాల్లో, అన్ని అవస్థలలో అంతటా ఏవస్తువు అయితే ఉందో అది నీవైఉన్నావు. దాని స్వరూపం ఆనందం, దానితో నీకు తాదాప్యం లేదు. ఏదైతే నీవు అవునో దానితో నీకు తాదాప్యం లేకపోవటం వలన నీ హృదయంలో ఉన్న ఆనందం నీకు అందటంలేదు. నీ గురించి నీకు సరియైన అవగాహన లేదు. నీకళ్ళతో నీవు చూసుకోవటంలేదు. ఎదుటివారి కళ్ళతో నిన్ను చూసుకొంటున్నావు. ఎంతకాలం ఇలా చూసుకొంటావు. దేహం నిజంకాదు అందుకే మారిపోతూ ఉంటుంది, మనస్సు నిజంకాదు అందుకే మారిపోతూ ఉంటుంది. ఇలా మారిపోయే వస్తువులతో నీకు తాదాప్యం ఉందికానీ ఎప్పడూ మారనివస్తువు తోటి, చావులేని వస్తువుతోటి నీకు తాదాప్యంలేదు. అందుకే లోపలఉన్న ఆనందం నీకు అందటంలేదు. ఏదో దేహయాత్రకు తగిన పనిచేసుకొంటూ మిగతా టైము అంతా ఆత్మజ్ఞానసముపార్జనకు ఉపయోగించుకోవాలి, శరీరం మరణించాక మనం చేసేది ఏమీలేదు, ఆత్మజ్ఞానాన్ని పొందటానికి ఈశరీరం ఉండగానే ప్రయత్నంచేయాలి.



ఈప్రపంచంలో రెండే విద్యలు ఉన్నాయి. పరావిద్య, అపరావిద్య, మనం కాలేజీలో, స్కూళ్ళలో నేర్చుకొనే విద్య అపరావిద్య. దానివలన దేహయాత్ర బాగా సాగిపోతుంది. సమాజంలో మనకు దండలు వేస్తారు, ఊరేగిస్తారు కాని అసలుసున్న. నీహృదయంలో ఉన్న సద్వస్తువును నేరుగా నీకు పట్టి ఇచ్చేది పరావిద్య, అదే ఆత్మవిద్య. భగవంతుడు ఆవిద్యగురించి చెపుతూ అది అన్ని విద్యలకు రాజు, ఆవిద్యను నేనే అని చెప్పాడు.

ఇక్కడ మనం అందరం కూర్చొని ఉన్నాము. శరీరం మరణించాక ఎవరి వాసనను బట్టి వారు ప్రయాణం చేసి వెళ్లిపోతారు, ఏలోకానికి వెళతారో తెలియదు. అందుచేత ఇప్పడే, ఇక్కడే ఈశరీరం ఉండగానే ఆనందానుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. నీకు ఆత్మానుభవం కలిగితే ఇంక ప్రయాణాలు ఆగిపోతాయి, పునర్జన్మలు ఆగిపోతాయి. అందుచేత కాలాన్ని పాడుచేసుకోవద్దు, పొందేది ఏదో ఇప్పడే ఇక్కడే పొందటానికి ప్రయత్నం చెయ్యి. వారు అలా అన్నారు, వీరు ఇలాఅన్నారు, కోడలు అలా అంది అని అత్తగారు, అత్తగారు అలా అంది అని కోడలు ఇలా పనికి రానిగొడవలు వేసుకొని తిరుగుతూ ఉంటే ఇంక మనకు సాధన ఏమిటి? మనకు భక్తి ఏమిటి? కొంతమందికి రోగంవస్తే ఇంక మనం చనిపోతామేమోననే భయం. ఇప్పడు మనం చనిపోయిన వారితో సమానమే ఎందుచేతనంటే మనం ఎవరిమో మనకు తెలియటంలేదు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే నీవు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తోంది కదా. నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలియటానికి నీకు అద్దంకావాలా లేకపోతే శాస్త్రంకావాలా? ఇవి ఏమీ లేకుండానే నీవు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తోంది కదా, ఆ ఉండటమే ఆనందం, ఆ ఉండటమే భగవంతుడు. మనమనస్సు, మాట, చేత ఒకటిగా ఉంటే మనకు అమృతానుభవం కలుగుతుంది. మనలో ఒక దోషం ఉంది. ఏదో రావిచెట్టు చుట్టూ తిరగటం ఇంకాకోరిక నెరవేరలేదు అనుకోవటం, గుడికి వెళ్ళిరావటం ఇంకాకోరిక నెరవేరలేదు అనుకోవటం. కోరిక ఉండవచ్చు, ఆకోరిక ఏదో రోజు నెరవేరుతుంది, మీకు అందులో సందేహంలేదు. కాని అది వెంటనే నెరవేరాలి అని మీరు అనుకోవద్దు. అలాగే జ్ఞానసముపార్జన కోసం ప్రయత్నం చేయండి అంతేగాని ఇంకా జ్ఞానం రాలేదు అనిఅనుకోవద్దు. ప్రయత్నం చేయండి, ఫలితంకోసం ఎదురుచూడవద్దు. మిమ్మల్ని ఎప్పడు అనుగ్రహించాలో భగవంతుడికి తెలుసు. కృషి చేయాలిగాని ఫలితంకోసం ఎదురుచూసినట్లు ఉండకూడదు, ఎదురుచూసినట్లు ఉంటే బంధం పెరుగుతుంది, దేహాభిమానం పెరుగుతుంది. మావగారు వెయ్యి ఎకరాలు సంపాదిస్తే నలుగురుకోడళ్లు నేనే ఆయనను చూడాలా, నేనే ఆయనను చూడాలా అని అనుకొని

మావగారికి అన్నంలేకుండా చేసిన వారు ఉన్నారు. ఈవెయ్యిఎకరాలు ఏంచేసుకొంటారు, చివరకు వాడు తిండిలేకుండా చనిపోతాడు. అదివాడి దేహప్రారబ్దం. ఇవన్నీ చూసి మీరు ఆశ్చర్యపడనక్కరలేదు. అది ఈశ్వరాజ్ఞ. ఈశ్వరాజ్ఞను ఉల్లంఘించటానికి ఎవరికి అవకాశంలేదు. నాకు ఎన్ని సంవత్సరాలలో జ్ఞానం వస్తుంది ఉజ్జాయింపుగా చెప్పండి అని భగవాన్‌ను అడుగుతున్నాడు. బ్రహ్మంలో కాలంలేదు. మనస్సు ఉంటేనే కాలం గాఢనిద్రలో మనం 12గంటలు నిద్రపోతే 12క్షణాల కిందవెళ్ళిపోతుంది, అక్కడ కాలం ఎక్కడ ఉంది. మనస్సుపనిచేస్తూఉంటే కాలం, మనస్సుపనిచేయనప్పుడు కాలం ఏముంది. లోపలఉన్న సద్వస్తువు కాలానికి అతీతం, కామానికి అతీతం. అహంభావన ఉదయించాక నీకు కాలం, దూరం వస్తున్నాయి. మనకు కాలం ఎప్పుడు బాధపెడుతుంది అంటే ఫలానా శరీరంనాది, ఫలానా పేరు నాది. అని ఆశరీరంతో, పేరుతో తాదాప్యం పొందినప్పడే కాలం పీడిస్తుంది, కామం పీడిస్తుంది. ఇక్కడ పీడించినా ఫరవాలేదు చనిపోయిన తరువాత కూడా పీడించే లోకాలకు వెళతాము. మనం బయట ఎంత బాగా ఉన్నా లోపల పాడైపోయాక మనంచేసేది ఏమీలేదు. చాలామంది చర్మసౌందర్యానికి ఇస్తున్న ప్రాముఖ్యత గుణసౌందర్యానికి ఇవ్వటంలేదు. ఏదో చెయ్యటం కాదు, కర్తలేనికర్మచెయ్యండి, నీదేహప్రారబ్దంలో ఏది జరగాలో అదిజరుగుతుంది. కర్తృత్వంతో చేసిన కర్మనిన్ను బంధిస్తుంది, కర్తలేని కర్మనిన్ను బంధించదు, మెడలో ఒక వస్తువును పెట్టుకొని, అది మెడలో పెట్టుకొన్నాము అన్న సంగతి మర్చిపోయి ఆవస్తువుకోసం వెతకటం ఎలా ఉంటుందో మనం మోక్షం కోసం వెదకటం కూడా అలాగే ఉంది. మనకు దేహగతమైన ఎరుక ఉంది, మనోగతమైన ఎరుక ఉంది, చైతన్యం తాలూక ఎరుకలేదు. మనం ఏవస్తువు కోసం అయితే వెతుకుచున్నామో అది మన మెడలోనే ఉన్నా ఆఎరుక పోవటం వలన మనకు మరుపు వచ్చేసింది, అక్కడ నుండి అన్వేషణ ప్రారంభించాము. నీవు శాంతికోసం వెతుకుచున్నావు, ఆనందం కోసం వెతుకుచున్నావు కాని అది నువ్వే అన్నసంగతి మర్చిపోయావు, అందుచేత వెతుకుచున్నావు. దాని తాలుక ఎరుక లేకపోవటం వలన అన్వేషణ ప్రారంభించావు. మీరు చెప్పే విషయాన్ని అందుకోవటానికి నాకు గైడెన్స్‌కావాలి అని అడిగితే నీహృదయంలో ఉన్నదానిని నీకు తెలియజెప్పేవాడు గురువు, గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు. బల్లమీద ఏదైనా వస్తువు ఉంది అనుకోండి, అక్కడ చీకటిగా ఉంటే ఆవస్తువు కనబడదు. లైటు తీసుకొని వస్తే ఆవెలుతురులో వస్తువు కనబడుతుంది. చీకటిలోనూ ఆవస్తువు ఉంది, వెలుతురు వచ్చినప్పడు ఆవస్తువు ఉంది కాని చీకటిలో నీకు కనబడటం లేదు, వెలుతురులో నీకు కనిపిస్తుంది. నీ హృదయంలో ఉన్న వస్తువును నీకు ఎరుకపరిచేది జ్ఞానం. జ్ఞానమే

5-6-2003

వెలుతురు. జ్ఞానం కలిగాక అది నీకు కొత్తగా రాలేదు, అది ఎప్పడూ ఉంది. దాని తాలుక ఎరుక కలుగజేసేది జ్ఞానం. ఎప్పడూ ఉన్న దానిని సంపాదించటం అంటూ ఏమీలేదు, ఉన్నది అదే. దానిని తప్పించి ఏది సంపాదించినా అది ఏదారిన వచ్చిందో ఆదారిన బయటకు పోతుంది. దానిని సంపాదించేటప్పడే అది ఎప్పడు నాశనం అవ్వాలో నిర్ణయింపబడి ఉంటుంది అని భగవాన్ చెప్పారు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, మిగతావి అన్నీ వచ్చిన దారినే పోతాయి. దేహం పుట్టింది కాబట్టి చనిపోతుంది. ఆత్మపుట్టలేదు అందుచేత దానికి చావులేదు. ఏవస్తువుకయితే పుట్టుకలేదో ఆనందం అంతా అక్కడే ఉంది, దానిని పొందటానికి ప్రయత్నంచెయ్యి. ఆపుట్టని వస్తువు ఎక్కడో ఉంది అని అనుకొంటున్నావు, అది నీలోనే ఉంది. ఆవస్తువు నీకు దొరికితే ఆనందం కూడా నీకు అనుభవంలోనికి వస్తుంది. నీకు జ్ఞానం కలిగే వరకూ వస్తువు అక్కడ ఉంది, ఇక్కడఉంది అని వెతుక్కొంటూనే ఉంటావు. ఎక్కడో ఉన్నది అనుకొన్నది ఇక్కడే ఉంది, ఎప్పడో తెలియబడుతుంది అనుకొనేది ఇప్పడే తెలుసుకోవచ్చు అనే భావన నీకు ఉండదు, అజ్ఞానం వలన నీకు అలా అనిపిస్తూ ఉంటుంది . ఏవస్తువు కయితే బంధం లేదో ఆ వస్తువును తెలుసుకొనే వరకు ఏదో బంధంలో పడుతూనే ఉంటావు. అందుచేత లోకాన్ని బాగుచేయటంకాదు. ముందు నీవు జ్ఞానాన్ని సంపాదించు, శాంతిని సంపాదించు. లోకం అలాఉంది, ఇలాగ ఉంది అని కాదు. అది అలాగేఉంటుంది. సొసైటీని నువ్వు తొందరగా మార్చలేవు, దానినేచర్ అటువంటిది. దాని గురించి కాదు నువ్వు ఆలోచించవలసింది, ముందుజ్ఞానాన్ని సంపాదించుకో. అక్కడ ముళ్ళుఉన్నాయి, ఇక్కడ రాళ్ళుఉన్నాయి అనుకొంటూ కూర్చోవద్దు. ముళ్లు అలాగే ఉంటాయి, రాళ్ళు అలాగే ఉంటాయి. నువ్వు చెప్పలు సంపాదించుకొని నీ దారిన వెళ్లిపో అప్పడు ముళ్ళు గుచ్చుకోవు, చెప్పకింద రాయిపడినా అవి గుచ్చుకోవు, నువ్వు శుభ్రంగా నడిచి వెళ్ళిపోవచ్చు. దేహమునేనుకాదు, కాని దేహము నాది అని చాలామంది అనుకొంటారు. కాని భాగవతంలో ఏమి చెప్పారు అంటే దేహమునేనుకాదు, నాదికూడా కాదు అని చెప్పారు. దేహమునాదికాదు కాబట్టే అందులో నుండి విడిపోతున్నాను. నాదిలో నుండి నేను విడిపోలేను ఏదైతే నేనుకాదో అందులోనుండి ఏదోరోజున విడిపోతాను.

రమణ భాస్కర

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 09-06-03 | సోమవారం | సాయంత్రం గం॥6-00ల నుండి భీమవరం, గునుపూడి శ్రీఉమాసోమేశ్వర జనార్దనస్వామి వారి ఆలయంలో |
| 18-06-03 | బుధవారం | సిద్ధాపురం రామాలయం |

## "నేను" గా బ్రతకకుండా "తాను" గా బ్రతకడమే జీవితలక్ష్యం

అనేక వేల జన్మలనుంచి శరీరంనేను, మనస్సునేను అనుకొంటూ వాటితో తాదాప్యం చెంది కర్తృత్వభావాన్ని ఆపాదించుకొంటూ వాసనలు పెంపొందించుకొంటూ నేను సుఖిని - నేను దు:ఖితుడను అనే దురదృష్టభావాలతో జీవిస్తూ ఉండటానికి, ఈ జనన-మరణచక్రంలో తిరగటానికి శరీరగతమైన, మనోగతమైన, ఈ బుల్లి నేనే కారణము. అలా కాకుండా జనన మరణాలకు అతీతంగా మంగళప్రదమై అఖండంగా ఆనందప్రదంగా ఉంటూ - ఈ ప్రకృతి గుణాలకు అతీతంగా సాక్షిగా ఉంటూ "ఉండటమే" గల చైతన్యాన్ని గుర్తించి "తాను"గా జీవించాలి. దానికి అభ్యాస వైరాగ్యాలతో ధర్మాచరణతో నీతివంతమైన క్రమశిక్షణ గల జీవితాన్ని అలవర్చుకోవాలి. అలా పవిత్ర జీవనం గడపినా సరిపోదు కారణం నిప్పను బూడిదమాటున కప్పినట్లు ఔతుంది. దాని వల్ల చల్లారదు. తీవ్రగాలికి బూడిద లేచిపోయి మరలా అగ్నిరాజుకోవటం ఆరంభించినట్లుగానే, మన కర్మల యొక్క వేగం తీవ్రంగా చెలరేగినప్పుడు అహంకారమనేఅగ్నిరాజుకోకమానదు. మనలోని వాసనలు అనే బండరాళ్లను మన స్వప్రయత్నంతో తొలగించుకోలేము. వాసనాక్షయానికి సద్గురు కృప ప్రధానం, అవసరం. ఈ భౌతిక వస్తుజాలం ఆరాధింపదగినదికాదని అది శరీరసుఖాన్ని మాత్రమే కలుగజేస్తుందని, శాశ్వత శాంతిని అందుపొందలేమని వాటిని అదుపు ఆజ్ఞలో ఉంచుతూ దీనిని "నాది" అని అంటిపెట్టుకోకుండా "తాను"గా జీవించాలి. మన మనోరోగాన్ని నయంచేసేది నేను ఆత్మస్వరూపుడనే అనే దృఢ విశ్వాసంతో నిరంతరం జీవించగలగాలి. కాని మనోప్రవాహంలో కొట్టుకొనిపోతూ ఉంటే అధమ స్థితి గలవారు, వారి దు:ఖాలయం చుట్టూ ప్రదక్షణం చేస్తూనే ఉంటారు. అందుకే శ్రీ నాన్నగారు అంటారు "ఇంద్రియాలను, మనస్సును బుద్ధిని దాటిన వానికి కామం ఎక్కడ ఉంటుంది. సర్వకాల సర్వావస్థల్లోనూ గంభీరంగా ఉండాలి, భేదభావం లేనప్పుడు తలంపు లేదు తలంపులేకపోతే కామం లేదు. మానవుడికి వచ్చే మొదటి వికారం అహంకారం ఎవరైతే సహజంగా జీవిస్తారో వారికి సహజంగా ఉన్న ఆనందం తెలుస్తుంది. అసహజంగా శరీరగతమైన నేనుగా జీవించే వారికి ఆనందం తెలియదు. చిరాకు-పరాకు మీకు నేనుగా వ్యక్తమౌతున్నది - కాని ఆత్మ మీకు - నేనుగా వ్యక్తమైతే అదే పరమస్థితి అన్నారు. వాస్తవంగా బ్రహ్మ కానిది బ్రహ్మానికి మించినది ఏదీ లేదు. కాని మనం ముత్యపు చిప్పలో మెరిసే వస్తువునే వెండి అని భ్రమించినట్లే శరీరం బాహ్య వికారాలకు లోనై అంతవరకు వచ్చే ప్రేమనే నిజమైనదని, ఆధారంగా ఉన్న పరమాత్మను అగౌరవం చేస్తూ శరీరమే నేనుగా బ్రతుకుతున్నాము. తానుగా బ్రతకలేకపోతున్నాము. "తానుగా బ్రతికితే అంతా తన్మయత్వమే - శివుని ఆనందనృత్య తన్మయత్వమే - దానికి సద్గురు రూపమే ప్రతీక" అంటారు పెద్దలు. కాబట్టి ఆ రూపాన్ని ఆరాధించి, ఆనందించి, ఆ ఆనందపదానికి అరుదెంచుదాము.

5-6-2003 **సాగిరాజు రామకృష్ణరాజు**, అర్థవరం



## ప్రారంభోత్సవ ఆహ్వానము


దిll 9-6-2003 సోమవారం సాll గంll4-16 నిllలకు

**సద్గురు శ్రీ నాన్నగారిచే**

**పాలకొల్లులో**

**రామా డిజిటల్ కలర్ ల్యాబ్ ప్రారంభించబడును**





**పశ్చిమగోదావరి జిల్లాలో ఏకైక డిజిటల్ కలర్ ల్యాబ్**

---

## భీమవరంలో సద్గురు శ్రీ నాన్నగారికి అభినందన సభ

దిll 9-6-2003 సోమవారం

సాయంత్రం గంll 5-00లకు

భీమవరం గునుపూడి ఉమా సోమేశ్వర జనార్దన స్వామి వారి ఆలయం నందు

**సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం**

సాయంత్రం గంll 5-30 నిllలకు

శ్రీ షిరిడి సాయి పారాయణ సేవా బృందం (పిప్పళ్ళ ప్రసాదరావు) భీమవరం వారి ఆధ్వర్యంలో

**సద్గురు శ్రీ నాన్నగారికి అభినందన సభ**

సద్గురు శ్రీ నాన్నగారి అమృత హస్తాలతో శ్రీ షిరిడి సాయిబాబా వారి అభయ హస్తమునందు

**సువర్ణ ఓంకార ధారణ.**

108 మంది పేదలకు వస్త్రధానము, అన్నదానము,

పట్టణ ప్రముఖ సంకీర్తన కళాకారులకు చిరు సత్కారం

సాయంత్రం గంll 6-00లకు సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనము.

రమణ భాస్కర